# మీరు చదివారా?

## – కృష్ణవేణి






(నెలనెలా ఓ పుస్తకం – సమగ్రపరిచయం)

### *That Long Silence*






*శశి దేశ్‌పాండే– పేరు పొందిన కన్నడ నాటక రచయిత, సంస్కృత పండితులయిన శ్రీరంగ వారి కుమార్తె. 1936లో ధార్వాడ్‌లో జన్మించారు. పదిహేనేళ్ళ వయస్సులో బోంబే వెళ్ళి ఇకొనిమిక్స్ చదివారు. ఆ తరువాత బెంగలూర్‌లో, లా పట్టా పొందారు. 1970లో శశి మొదట కథలు రాయడంతో ప్రారంభించారు. పిల్లలకోసం నాలుగు కథాసంకలనాలు రాశారు. ఏడు నవళ్ళు రాశారు. వాటిల్లో ఒకటైన 'దట్ లాంగ్ సైలెన్స్' పుస్తకానికి 1990లో సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రదానం అయింది. 2009లో శశి పద్మశ్రీ పొందారు. ఆమె– సంస్కృతం, మరాఠీ, కన్నడం ధారాళంగా మాట్లాడగలరు. ఆమె పుస్తకాలు– కుటుంబాల్లోనూ, సమాజంలోనూ తమ చోటు కోసం పోరాడే చదువుకున్న మధ్య/ఎగువ మధ్య తరగతి స్త్రీలని ఆధారంగా చేసుకుని రాసినవి.*

*196 పేజీల 'దట్ లాంగ్ సైలెన్స్'ను పెంగ్విన్ బుక్స్ జనవరి ఒకటిన, 1989లో ప్రచురించింది.*

★★★

జయ చురుకైన, హుషారైన పిల్ల. తెలివైనది. ఉమ్మడి కుటుంబంలో పుట్టినది. 'సభ్యతగా ఉండి ఇంటిపన్లు, అందరినీ ఆదరించే అలవాటూ నేర్చుకుంటే, అత్తగారింట్లో సర్దుకుపోవడం సులభం...సీత రాముడికి వనవాసంతో తోడున్నట్టుగా... భర్తను మరణంనుండి విడిపించిన సావిత్రిలా... భర్త కష్టాలను ద్రౌపతి నిగ్రహంగా పంచుకున్నట్టు.' ఉండమని నాయనమ్మ సలహా ఇస్తుంటుంది.

జయ బాగా చదువుకుంటుంది. కాలములూ, కథలూ రాస్తుంటుంది. కుటుంబ స్నేహితుల కొడుకైన మోహన్‌తో పెళ్ళవుతుంది. అతనికి మంచి ఉద్యోగం, సామాజిక హోదా ఉంటాయి. తమిద్దరికీ ఒకరిని మరొకరిని అర్థం చేసుకోవడం రాదని మొదట్లోనే గ్రహిస్తుంది జయ. అన్యోన్యత లేని తమ వైవాహిక జీవితం అస్థిరంగా, దుర్భరంగా గడుస్తుందని తెలుసుకోడానికి ఎంతోకాలం పట్టదు.

మోహన్‌కి బొంబాయి బదిలీ అవుతుంది. అప్పటికే ఆమె భారతదేశపు మధ్యతరగతి స్త్రీల కష్టాలమీద రాసిన సాహిత్యానికి–పేరు రావడం ప్రారంభిస్తుంది. కొత్త పట్టణానికి దంపతులు త్వరలోనే అలవాటు పడతారు. రాహుల్, రతి పుడతారు. జయ జీవితం– భర్తా పిల్లల చుట్టూనే తిరుగుతూ ఉండి, దాన్లోనే ఓదార్పు పొందుతుంది. అయితే, అదెంత కాలమూ సాగదు. ఆఫీస్లో దొంగ సంతకాల కేసులో తన స్నేహితుడైన అగర్వాల్‌తో పాటు మోహన్ ఇరుక్కుంటాడు. భార్యా పిల్లలకోసమే లంచం తీసుకున్నానని మోహన్ అన్నప్పుడు జయాకి మొట్టమొదటిసారి కోపం వస్తుంది.

'అసలు తను ఏ పాత్రా పోషించకపోయినప్పటికీ తనూ ఆ నేరంలో భాగస్థురాలేనన్న భావనే ఆమెకు జుగుప్సాకరంగా అనిపిస్తుంది.' మోహన్ జయా కలిసి చర్చ్ గేట్లో ఉన్న తమ ఆధునిక ఇంటిని వదిలి, స్నేహితుల సలహాతో దాదర్‌లో ఉన్న ఒక ఇరుకైన ఫ్లాటుకి మారతారు.

జయా తనకి సుపరిచితమైన వాతావరణాన్నుండి దూరం అవుతుంది. భర్త పేరు ప్రతిష్టలు కోల్పోతుంటాడు. వారి కుటుంబ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అప్పటికే, మెల్లమెల్లగా తన రాతలను వదిలేస్తున్న జయను గతం వెంటాడడం మొదలెడుతుంది. 17 ఏళ్ళ వైవాహిక జీవితంలో– భర్తకీ తనకి ఉన్న తేడాలు, మనస్పర్థలు, తన టీనేజీ పిల్లల వల్ల కలిగిన నిస్పృహ– అన్నీ బయటపడ్డం ప్రారంభిస్తాయి. ఒకసారి తన పొరిగింటి కామత్‌కు చెప్తుంది: 'ఏ స్త్రీకీ కూడా కోపం రాకూడదు. కోపంగా ఉండే యువతి గురించి ఎప్పుడైనా విన్నావా? ఊహూ, లేదే! ఆమె మానసిక రోగి అయుండొచ్చు, వెర్రిదవొచ్చు. ఆశాభంగం కలిగినదయి ఉండవచ్చు. కోపం మాత్రం తెచ్చుకోలేదు.'

తను రాయలేకపోవడం, తన ప్రమేయం లేకుండానే పెళ్ళి తరువాత తన పేరు సుహాసినిగా అత్తగారి కుటుంబం మార్చడంవంటి సంఘటనలన్నిటినీ భూతద్దంతో చూస్తూ, తన జీవితాన్ని తన చేతులనుండి ఎప్పుడు చేజార్చుకుందో కూడా అర్థం చేసుకోలేకపోతుంది. యీ లోపల ఆర్థిక పరిస్థితి కూడా దిగజారుతుంటుంది. అన్నేళ్ళ సహచర్యంలో కూడా మోహన్‌కు జయ అభిప్రాయం తెలుసుకునే అలవాటుండదు. అయితే, తన మీద ఆఫీసులో ఎంక్వైరీ పెట్టినప్పుడు, అతనికి భార్య ఓదార్పు, సహానుభూతి కావాలనిపిస్తాయి. తన రాతలు కొనసాగిస్తూ ఇంటిని పోషించమంటాడు జయను. ఏమిటి చెప్పాలో అర్థం కాని భార్య మౌనం వహించి, భర్త బాధను పంచుకోలేకపోతుంది. వారి సంబంధం మరింత క్షీణించి ఇద్దరి మధ్యలో దూరం ఎక్కువవుతుంది. మోహన్ తన ఆత్మవిశ్వాసాన్నీ. ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకుని, ఇల్లు వదిలిపెడతాడు.

వంటరిగా కాలం గడుపుతూ భర్తకు అత్యంతవసర సమయాన్న తన సహకారం, ప్రోత్సాహం అందించకపోవడం తన తప్పే అని గుర్తిస్తుంది జయా. మోహన్‌తో అన్యోన్యత ఉన్నా లేకపోయినా కూడా అతను లేకుండా, తనక్కొర్తే ఉండలేకపోతుందనీ తెలుసుకుంటుంది.
ఇంతలో ఒకసారి రాహుల్ కనపడకుండా పోవడం పరిస్థితిని మరింత గంభీరం చేస్తుంది. స్నేహితులూ, ఇరుగుపొరుగూ ఆమెని ఊరడించి సహాయం చేస్తారు. మోహన్‌కూ తనకూ మధ్య చోటు చేసుకుని, తమ సంబంధాన్నీ, పరస్పర నమ్మకాన్నీ చెడగొట్టిన 'దీర్ఘ మౌనాన్ని' గుర్తిస్తుంది జయా. చిన్నపిల్లగా ఉన్నప్పటినుండీ తన్ని నిర్లక్ష్యపెట్టబడ్డం వల్లే తన లోపల నిస్శబ్దం పేర్కొందని అనుకుంటుంది. తను వెంటనే ఇంటికి తిరిగి వస్తున్నాననీ, ఎంక్వైరీ బోర్డ్ తన శిక్ష రద్దు చేసిందనీ మోహన్ నుంచి టెలిగ్రామ్ వస్తుంది.

ఆ మధ్యకాలంలో తను పడిన సంఘర్షణ, సందేహం, వంటరితనం జయను ఒక కొత్త స్త్రీగా మారుస్తాయి. ఇకనుంచీ, అటువంటి దీర్ఘ నిస్శబ్దాన్ని తమ మధ్య కానీ తనయందు కానీ ప్రవేశించనీయకూడదని నిర్ణయించుకుంటుంది. జీవితకాలం ఆ నిస్శబ్దంలోనే గడిపేననుకున్నాకానీ, అది తన ఎంపికే తప్ప ఎవరూ తన మీద బలవంతంగా రుద్దినది కాదని ఆఖరికి గ్రహిస్తుంది.

తనకు హటాత్తుగా కలిగే అనుభూతుల ఆధారంపైన వెనువెంటనే ప్రతిస్పందించే స్వభావం మార్చుకుని, జయ పరిణితి చెందిన స్త్రీగా మారుతుంది. భార్యాభర్తల మధ్య పడిన బీట మాయమవుతుంది.

★★★

రచయిత్రి– కథనాన్ని గతానికీ, వర్తమానానికీ, భవిష్యత్తుకీ త్వరత్వరగా మారుస్తారు. కాల్పనిక కథే అయినప్పటికీ ఇది అనేకమైన స్త్రీలు తమకు అన్వయించుకోగలిగేదే. యీ కాలంలో ప్రతీ స్త్రీ తన హక్కుల గురించి ఎరిగినదై ఉండి, తన నిర్ణయం తాను తీసుకోగలిగేదే అయినప్పటికీ, ఆ మౌనం వారిలో కూడా కొనసాగుతుంది.

ఏవి జరిగాయో, జరగలేదో, జరగాల్సి ఉండాల్సిందో, జరగబోతున్నాయో, జరుగుతాయో– యీ ఏకభాషణలన్నీ జయ మనస్సులో ఊహించుకునేవే. నిర్దిష్టమైన కథాంశం అంటూ లేని నవలికలో ఉన్న పాత్రలు అనేకం. జయ గొంతుతో వినిపించే యీ ఉత్తమ పురుష కథనం– కుటుంబ సభ్యులందరితో, చుట్టుపక్కలవారితోనూ తనకున్న సంబంధాన్నీ, ప్రవర్తననీ విశ్లేషిస్తుంది. కథకురాలి ఏకపక్షమైన, పరిమితమైన పరిధిలో ఉండే కథలో, ఏ సంఘటనలో ఎంత నిజముంటుందో సులభంగా అర్థం కాదు.

COMMENTS